సాక్షి శ్రీకాకుళం

గురువారం । 16 । మే । 2024



సెలవుల్లో జాగ్రత్త..!

వేసవి సెలవుల్లో పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిపుణులు చెబుతున్నారు. -10లో



'నాన్‌స్టాప్'గా రద్దీ

ఓటు వేసేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో బస్సులు రద్దీగా మారాయి. -10లో

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నరసన్నపేటకు చెందిన ఆరంగి సరస్వతమ్మ తన భర్త కృష్ణమూర్తి జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళాన్ని బుధవారం చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి జి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ రూ.లక్ష, అంతకుమించిన విరాళాలు ఇచ్చిన దాతలకు డోనర్ పాసులను అందజేస్తామని తెలిపారు.

న్యూస్‌రీల్

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అండర్ గ్రాడ్యుయేషన్(డిగ్రీ) మొదటి సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం విడుదల చేశారు. ఫలితాలను జ్ఞానభూమి వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. పరీక్షలకు 8299 మంది హాజరు కాగా 4911 మంది ఉత్తీర్ణత సాధించారు. 59.18 శాతం మంది పాసయ్యారు. బీఏ హానర్స్‌లో 894 మందికి 271 మంది, బీబీఏ హానర్స్‌లో 134 మందికి 79 మంది, బీసీఏ హానర్స్‌లో 249 మందికి 210 మంది, బీకాంలో 1365 మందికి 591 మంది, బీఎస్సీ హానర్స్‌లో 5641 మందికి 3754 మంది, ఒకేషనల్ కోర్సు బీవీఓసీలో 16 మందికి ఆరుగురు ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు 15 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్కుల జాబితాలు కళాశాలలకు అందజేయనున్నట్లు చెప్పారు.

స్కూటీ డిక్కీలో రూ.3.50 లక్షల చోరీ

ఇచ్ఛాపురం: నిత్యం రద్దీగా ఉన్న ప్రాంతంలో స్కూటీ నుంచి రూ.3,50,000 చోరీ చేసిన ఘటన కలకలం రేపింది. పార్కింగ్ చేసి తన షాపుకు వెళ్లి తిరిగి వచ్చే లోపే దొంగతనం జరగడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. ఇచ్ఛాపురం పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఇచ్ఛాపురం దాసన్నపేటకు చెందిన సంగంశెట్టి లింగంమూర్తి అనే బియ్యం వ్యాపారి యూనియన్ బ్యాంక్ నుంచి రూ.4 లక్షలు విత్‌డ్రా చేశారు. ఆ సొమ్మును ఓడీ 07 వై 3929 నంబర్ గల తన స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. అనంతరం రథంవీధిలోని దినవారి మార్కెట్‌కు వచ్చి స్కూటీని పార్కింగ్ చేసి అక్కడికి కొద్దిదూరంలో ఉన్న తన షాపుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి డిక్కీలో రూ.50 వేల నగదు మాత్రమే ఉండగా మిగిలిన రూ.3,50,000 నగదు కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్కూటీ పార్కింగ్ చేసిన షాపుల వద్ద సీసీటీవీ ఫుటేజిని పరిశీలించగా పదేళ్ల పిల్లాడితో కలిసి పల్సర్ బైక్‌పై వచ్చిన వ్యక్తి దొంగిలించినట్లు గుర్తించారు. అక్కడి నుంచి ఒడిశా వైపు వెళ్లిపోయినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూర్మనాథుని కల్యాణోత్సవానికి అంకురార్పణ



అంకురార్పణ పూజల్లో అర్చకులు

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథుని వార్షిక కల్యాణోత్సవానికి బుధవారం అంకురార్పణ జరిగింది. ఏటా జరిగే స్వామి కల్యాణోత్సవానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ నెల 19న వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినాన రాత్రి 10 గంటల సమయంలో కల్యాణం జరగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక్కులు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పరిషత్, రక్షాబంధనం, విశేష మండపాహావానాలు, అంకురార్పణ, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.గురునాథం, దాసుబాబు, స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, కిషోర్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.



భానుడి భగభగ..

ఎండలు మండుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భయపెడుతున్నాయి. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చేవారికి చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో ఉదయం 11 గంటలకే రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చే వారు ఎండ నుంచి రక్షణ పొందేందుకు నానా ప్రయాసలు పడుతున్నారు. శ్రీకాకుళం నగరంలో బుధవారం మండుటెండలో జనం పాట్లు ఇక్కడ చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



ఎండలో వెళ్తూ..



నిర్మానుష్యంగా శ్రీకాకుళం సూర్యమహల్ జంక్షన్





గొడుగుతో ఉపశమనం



చీరకొంగే ఎండ నుంచి రక్షణ

● పోలింగ్ అత్యధికం

సంకేతం సానుకూలం!

● జిల్లాలో 133 బూత్‌లలో 90శాతంపైగా పోలైన ఓట్లు ● 927 బూత్‌లలో 80 శాతానికి పైగా పోలింగ్
● ఫలితాలపై చూపనున్న ప్రభావం ● గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

ప్రస్తుత ఎన్నికల్లో పోలింగ్ శాతాలు రికార్డులు సృష్టిస్తున్నాయి. అత్యధికంగా పోలింగ్ జరగడం ఎవరికి అనుకూలం.. ఇంకెవరికి ప్రతికూలం అన్న చర్చలు జోరుగా జరుగుతున్నాయి. ఇది ప్రభుత్వ వ్యతిరేక ఓటేనని కూటమి నేతలు బింకంగా చెబుతున్నారు. పోలింగ్ సరళిని పరిశీలిస్తే అది కచ్చితంగా ప్రభుత్వానికి సానుకూలంగా పడిన ఓటని స్పష్టమవుతుంది. ఈ ఎన్నికల్లో మహిళలు, వృద్ధులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఓట్లు వేశారు. ఈ వర్గాల్లో దాదాపు అందరూ ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్నవారే. ఇక ఓటింగ్ శాతం పెరిగితే అధికార పార్టీకి నష్టమన్న వాదన అన్ని సందర్భాల్లోనూ పనిచేయదు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ గెలిచింది. ఆ ఎన్నికల కంటే 2009 ఎన్నికల్లో రెండు శాతానికి పైగా అధిక పోలింగ్ జరిగింది. అయినా వైఎస్ రాజశేఖరరెడ్డి మళ్లీ గెలిచి రెండోసారి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఇప్పుడు కూడా 2019 కంటే రెండు శాతం పోలింగ్ పెరిగినందున నాడు వైఎస్ మాదిరిగానే నేడు వైఎస్ జగన్ రెండోసారి విజయం అందుకోవడం ఖాయమని, శ్రీకాకుళం జిల్లాలోనూ తమ గెలుపు తథ్యమని అధికార పార్టీ అభ్యర్థులు గట్టి ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లలో 90 శాతానికి మించి ఓట్లు పోలయ్యాయి. 80 నుంచి 89 శాతం పోలైన బూత్‌లైతే అత్యధికంగా ఉన్నాయి. ఇవన్నీ తమకే అనుకూలమని ఎవరికి వారు అనుకుంటున్నా.. అస లేం జరిగి ఉంటుందో నాయకులకు తెలుసు. ఇంత పోలింగ్ జరగడానికి 58 నెలల కాలంలో జరిగిన కార్యక్ర మాలే కారణమని తెలిసినా కూటమి నాయకులు మాత్రం బయటకు మేకపోతూ గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఓవైపు క్షేత్రస్థాయిలో రహస్య సర్వే లు.. మరోవైపు ఫోన్లలో అభిప్రాయ సేకరణ.. ఇంకోవైపు విభిన్న ప్రాంతాల్లో అనేక రూపాల్లో సమాచార సేకరణతో పోలింగ్ సరళిని తమదైన శైలిలో విశ్లేషించుకుంటున్నారు. అనుకూలంగా వచ్చే లెక్కలతో కొందరు ఉపశమనం పొందుతున్నారు. ప్రతికూలంగా వచ్చే లెక్కలు కొందర్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.



మేలుచేసిన పార్టీకి..



రెండు మూడు వందల ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో 90 శాతం పైబడి పోలైతే పెద్దగా ప్రభావం ఉండదు. కానీ 500, 1000 ఓట్లు ఉన్న బూత్‌ల్లో కూడా 80, 90శాతం పైబడి ఓట్లు పోలైతే తప్పనిసరిగా ప్రభావం చూపిస్తోంది. జిల్లాలో 133 బూత్‌లలో 90 శాతానికి పైగా ఓట్లు పోలయ్యాయి. 927బూత్‌ల్లో 80 శాతానికి పైగా ఓట్లు పోలయ్యాయి. ఈ స్థాయిలో ఓటింగ్ జరిగిందంటే ప్రజలు కృతజ్ఞతగా వేశారని స్పష్టమవుతోంది. మేలు చేసిన పార్టీకి అనుకూలం అన్న భావన రాజకీయ విశ్లేషకుల్లో కూడా ఉంది. అందులో మహిళలు అత్యధికంగా ఓటేయడంతో ఆ ఎఫెక్ట్ ఎవరిపై పడుతుందో రాజకీయ నాయకులకు తెలుసు. అందుకే దుష్ప్రచారంతో గంపెడాశలు పెట్టుకున్న రాజకీయ పార్టీకి ఈ పరిణామం మింగుడు పడటం లేదు. బూమ్‌రాంగ్ అవుతుందా? అనుకూలిస్తుందా? అనే దానిపై ఓ అంచనాకు రాలేని పరిస్థితి నెలకొంది.

ఎవరికి వారు జోస్యం..

పెరిగిన ఓటింగ్‌పై ఒక్కొక్కరు ఒక్కో రకంగా జోస్యం చెబుతున్నారు. పోలింగ్ శాతం పెరిగితే ప్రతిపక్షాలకు అడ్వాంటేజ్ అని, అదంతా అధికార పక్షంపై ఉన్న వ్యతిరేకత అని కూటమి నాయకులు సమర్థించుకోగా, పోలింగ్ శాతం పెరిగితే అధికార పక్షానికి మరింత మద్దతు ఇచ్చినట్టుగా అని గతంలో జరిగిన ఎన్నికలను వీరు గుర్తు చేస్తున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తొలిసారి ముఖ్య మంత్రి అయిన 2004 ఎన్నికల్లో 69.96శాతం ఓటింగ్ జరగ్గా, రెండో సారి ముఖ్యమంత్రి అయిన 2009 ఎన్నికల్లో 72.72శాతం ఓటింగ్ నమోదైంది. అంటే దాదాపు 2.76 శాతం అధికంగా పోలైంది. పోలింగ్ పెరిగినా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, దానికంతటికీ ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే కారణమని అప్పట్లో విశ్లేషణ జరిగింది. ఇప్పుడదే పునరావృతమవుతుందని, ప్రజలకు అన్ని రకాలుగా మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచేలా ఓటేసేందుకు ప్రజలు పోటెత్తారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. టీడీపీ వ్యతిరేకత అనుకుంటే, వైఎస్సార్‌సీపీ అనుకూలతంగా భావిస్తోంది. పెరిగిన పోలింగ్ తమకే కలిసొస్తుందని ఇరుపార్టీలు సమర్థించుకుంటున్నాయి.

ఎచ్చెర్ల (పోలింగ్ శాతం)	బూత్‌ల సంఖ్య
90కు పైగా	59
80కు పైగా	176
70కు పైగా	63
60కు పైగా	8
ఇచ్ఛాపురం	
80 నుంచి 89	29
70 నుంచి 79	128
60 నుంచి 69	124
పలాస	
90కు పైగా	8
80 నుంచి 89	104
70 నుంచి 79	115
60 నుంచి 69	52
టెక్కలి	
90కు పైగా	15
80 నుంచి 89	154
70 నుంచి 79	125
60 నుంచి 69	16
పాతపట్నం	
90కు పైగా	4
80 నుంచి 89	65
70 నుంచి 79	133
60 నుంచి 69	103
శ్రీకాకుళం	
90కు పైగా	5
80 నుంచి 89	89
70 నుంచి 79	56
60 నుంచి 69	49
ఆమదాలవలస	
90కు పైగా	11
80 నుంచి 89	154
70 నుంచి 79	79
60 నుంచి 69	14
నరసన్నపేట	
90కు పైగా	31
80 నుంచి 89	156
70 నుంచి 79	90
60 నుంచి 69	11



స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత



భద్రత సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పర్యవేక్షించారు. మూడంచెల భద్రత నిర్వహణపై పలు సూచనలు చేశారు. కేంద్ర పోలీస్ భద్రత సిబ్బంది, ఆర్మ్‌డు రిజర్వు పోలీసులు, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రౌండ్ ది క్లాక్ భద్రత కొనసాగుతుందని వివరించారు. ఎస్పీతో పాటు ఎచ్చెర్ల ఎస్సై ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.

నీలమణిదుర్గకి ప్రత్యేక పూజలు



మంత్రహోమం నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: ఉత్తరాంధ్రుల కల్పవల్లి పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయ యాగశాలలో మూల మంత్ర హోమాలు, నీరాజన మంత్ర పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 49వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖడ్గ నామాలతో కుంకుమార్చనలు నిర్వహించామని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● అందుబాటులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య
● గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు మంచి అవకాశం
● ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రవేశాల్లో నాలుగు శాతం డిప్రివేషన్ స్కోర్
● ఎస్ఎంపురం క్యాంపస్‌లో అందుబాటులో 1100 సీట్లు
● ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ ప్రారంభం
● జూన్ 25 ఆఖరు తేదీ

ఉజ్వల భవిష్యత్‌కు కేరాఫ్..

ఆర్‌జీయూకేటీ

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ)లు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యకు చిరునామాగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల ఉన్నత విద్య కలను సాకారం చేస్తూ వారు అత్యున్నత స్థానాల్లో కొలువులు సాధించేందుకు ఆసరాగా ఉంటున్నాయి. పదో తరగతి మార్కుల ఆధారంగా ఇందులో ప్రవేశాలు లభిస్తాయి. రాష్ట్రంలో నాలుగు క్యాంపస్‌లు శ్రీకాకుళం, ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలులో ప్రవేశాలకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఒక్కో క్యాంపస్‌లో 1100 సీట్లు(ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ రిజర్వేషన్‌తో కలిపి) అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు నాలుగు శాతం డిప్రివేషన్ స్కోర్ ఇస్తారు. 10వ తరగతి మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు, ఎన్ సీసీ, స్పోర్ట్స్, స్కౌట్, ఆంగ్లో ఇండియన్, దివ్యాంగులు వంటి ప్రత్యేక కోటాలు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.



శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ

అత్యుత్తమ విద్య..

ఆర్‌జీయూకేటీలో ఆరేళ్లు చదువుకునే అవకాశం లభిస్తుంది. రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు, నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సు చదువుకోవచ్చు. లేదంటే పీయూసీ పూర్తిచేసి రిలీవ్ కావచ్చు. పీయూసీ అనంతరం ఇంజినీరింగ్‌లో కొనసాగవచ్చు. సీఎస్‌ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ, ఐటీ వంటి బ్రాంచ్‌తో పాటు ఇడుపులపాయ, నూజివీడుల్లో ప్రత్యేక బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. ఆర్‌జీయూకేటీలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఉన్నత విద్యకు సంబంధించిన గేట్ వంటి ర్యాంకులు సాధిస్తున్నారు. కొందరు విద్యార్థులు ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ వంటి అత్యున్నత ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. పరిశ్రమల్లో మంచి ప్యాకేజీలకు సైతం సాధిస్తున్నారు.

జూలై 11న జాబితా..

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల కాగా, 8వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. జూన్ 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జూలై 11న ఎంపికైన వారి జాబితా విడుదల చేస్తారు. జూలైలో ప్రవేశాలు పూర్తిచేసి, ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

రెసిడెన్షియల్ విధానంలో బోధన..

ఏడాదికి పీయూసీ ఫీజు స్ట్రక్చర్ రూ.45 వేలు కాగా, ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.50 వేలు, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు రూ.1.50 లక్షలుగా నిర్ణయించారు. అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు లభిస్తాయి. తెలుపు రేషన్ కార్డు ఉన్న కుటుంబాల పిల్లలకు ఉచితంగా విద్య లభిస్తుంది. పూర్తిగా రెసిడెన్సియల్ విధానంలో బోధన జరుగుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి..



10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ పేద విద్యార్థులకు ఆర్‌జీయూకేటీ మంచి అవకాశం. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు నాలుగు శాతం వెయిటేజీ ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందిస్తున్నాం. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ పూర్తి చేసి రిలీవైన విద్యార్థులకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అత్యున్నత స్థాయికి విద్యార్థులు చేరుతున్నారు.

– ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, డైరెక్టర్, ఆర్‌జీయూకేటీ క్యాంపస్

గొట్టా బ్యారేజీ పటిష్టతకు చర్యలు



హిరమండలంలోని గొట్టా బ్యారేజీని పరిశీలిస్తున్న సీఈసీడీఓ బృందం

హిరమండలం: గొట్టా బ్యారేజీ పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఈసీడీఓ(చీఫ్ ఇంజినీర్ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్) బృందం ప్రకటించింది. బ్యారేజీ నాణ్యత పరిశీలించేందుకు బృంద సభ్యులు బుధవారం హిరమండలంలో పర్యటించారు. గొట్టబ్యారేజ్, వంశధార రిజర్వాయర్, ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన అనంతరం కార్యాలయంలో వంశధార అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్ధంతరంగా నిలిచిన బ్యారేజీ మరమ్మతు పనులు, ప్రస్తుత స్థితిగతులు, బ్యారేజీ నాణ్యత తదితర అంశాలపై చర్చించారు. బ్యారేజీ దిగువన కోతకు గురైన జడ్జిస్టోన్, యాప్రాన్ ఇతర పనులపై ఆరా తీశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ తిత్లీ తుఫాన్ ముందు గొట్టా బ్యారేజీ దిగువన జడ్జి స్టోన్, రాతి కట్టడం వంటి పనులకు కొన్నేళ్ల కిందట రూ.12.19 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తిత్లీ తుఫాన్ కారణంగా పనులు నిలిపివేశామన్నారు. ఈ నేపథ్యంలో అంచనా నిధులు పెంచేందుకు, ప్రాధాన్యతా క్రమంలో చేయాల్సిన పనులపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు. ఎత్తిపోత పైపుల ద్వారా రిజర్వాయర్‌లోకి నీటిని పంపే పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేస్తామని ఎస్ఈ డోల తిరుమలరావు తెలిపారు. 2025నాటికి పనులు పెండింగ్ లేకుండా పూర్తిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఈసీడీఓలు బి.ఎస్.ఎస్.శ్రీనివాసయాదవ్, ఎస్.శివకుమార్‌రెడ్డి, ఎస్‌సీఈవోలు ఎ.విజయభాస్కర్, ఏ.శేషుబాబు, సీడీఓలు ఎం.కె.ఎస్.రెడ్డి సత్యనారాయణ, వంశధార కట్టడాల విభాగం ఈఈ, డీఈఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాలపై కేసు నమోదు


చాపురం గోవిందపురం గ్రామాల్లో పోలీస్ పికెట్

శ్రీకాకుళం రూరల్: ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ సమయంలో చాపురం, గోవిందపురం పరిధిలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయులు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఇరు గ్రామాలకు చెందిన తొమ్మిది మందిపై రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వాసుదేవరావు తెలిపారు. రెండు గ్రామాల్లోనూ పోలీస్ పికెట్ కొనసాగుతుందని చెప్పారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి



శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని సూర్యమహల్ కూడలి సమీపంలో ఆటో ప్రమాదానికి గురైన వ్యక్తి జెమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చినమండలవీధిలో పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న తోట శ్రీనివాసరావు (46) తన చెల్లెల్లిద్దరితో కలిసి మంగళవారం సరుబుజ్జిలిలో బంధువుల ఇంటికి బయల్దేరారు. సూర్యమహల్ కూడలి వద్ద ఆటో ఎక్కి సీటులో కూర్చుంటుండగానే డ్రైవర్ నిర్లక్ష్యంతో స్టార్ట్ చేసి ముందుకు తీయడంతో శ్రీనివాసరావు రోడ్డుపై పడిపోయాడు. దీంతో రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. తలపై గాయం కనిపించకపోయినా అంతర్గతంగా రక్తస్రావమై మృతి చెందినట్లు అక్కడ ముఖ్య వైద్యాధికారి ప్రవీణ్ ధ్రువీకరించడంతో ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహితకు గాయాలు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని కిమ్స్ సమీపంలోని దత్తాత్రేయస్వామి గుడి వద్ద ద్విచక్ర వాహనం పైనుంచి జారిపడి ఓ వివాహితకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు విజయనగరం జిల్లా రాజాం మండలం వంజరాంపేట నుంచి గోవిందరావు, సత్యవతి దంపతులు తమ కుమారుడు, కోడలుతో కలిసి రెండు ద్విచక్రవాహనాల్లో బుధవారం వచ్చారు. తిరుగు ప్రయాణంలో కిమ్స్ సమీపంలోని దత్తాత్రేయ గుడి వద్దకు వచ్చేసరికి స్పీడ్ బ్రేకర్ గమనించకపోవడంతో గోవిందరావు వెనుక కూర్చున్న భార్య సత్యవతి జారి పడి ఎదురుగా ఉన్న డివైడర్‌పై పడిపోయింది. ఆమె తలకు తీవ్ర గాయమవ్వడంతో కుటుంబసభ్యులు సమీపంలోని కిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు పేర్కొన్నారు.

ఘనంగా బంగారమ్మ జంగిడి ఊరేగింపు


జంగిడి ఊరేగిస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట వంశధార నదీతీరంలో కొలువైన బంగారమ్మ తల్లి అమ్మవారి పెద్ద పండగలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నెల 28వ తేదీ వరకు పండగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం అమ్మవారి జంగిడి ఊరేగింపు ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ధూపదీపాలతో నైవేద్యం, ప్రసాదాలు సమర్పించారు.

'ఆ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు వేసవి సెలవుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గంగు మన్మధరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండుటెండలు, ఉక్కపోతలతో ఇంటి వద్ద కూడా అలమటిస్తున్న తరుణంలో విద్యార్థులు విద్యాసంస్థల్లో ఎలా ఉండగలరని ప్రశ్నించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా విద్యార్థులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తరగతులు, అదనపు తరగతులు నిర్వహిస్తున్న స్కూల్స్, కాలేజీలపై సంబంధిత జిల్లా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సెలవుల్లో జాగ్రత్త..!

- పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి
- నైతిక విలువలపై అవగాహన కల్పించాలి
- సృజనాత్మకత పెంపుపై దృష్టి పెట్టాలంటున్న నిపుణులు


టెక్కలి సత్యసాయి శాంతి సుధా మందిరంలో బాల వికాస్ విద్యార్థులకు నైతిక విలువలు నేర్పుతున్న నిర్వాహకులు

టెక్కలి: వేసవి సెలవులు ప్రారంభమై ఇరవై రోజులు పూర్తయ్యాయి. చాలామంది చిన్నారులు తాతయ్య వారి ఊళ్లకు వెళ్లగా.. మరికొంత మంది ఇళ్ల వద్దే కాలక్షేపం చేస్తున్నారు. ఈ సమయంలో ఆడుకునేందుకు బయటకు వెళ్తున్న పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఇంటి పెద్దలు దృష్టి సారించాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చెరువులు, నదుల వద్దకు వెళ్లకుండా చూడాలని అంటున్నారు. కొత్తూరులో తన అమ్మమ్మ ఇంటికి వచ్చి సరదాగా సమీపంలో పారాపురం మినీ జలాశయానికి వెళ్లిన తొమ్మిదో తరగతి విద్యార్థి హరీష్ మృత్యువాత పడ్డాడు. పాత హిరమండలంలో తోటి స్నేహితులతో కలిసి వంశధార నది వద్దకు స్నానానికి వెళ్లిన తొమ్మిదో తరగతి విద్యార్థి బాల మాధురి మృత్యువాత పడింది.. ఇలా ఏటా వేసవి సెలవుల్లో ఎంతో మంది విద్యార్థులు ఏదో ఒక రూపంలో మృత్యువాత పడుతున్నారు. ఇలాంటికి జరగకుండా పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉండాలి. ఎండల భారిన పడి అనారోగ్యానికి గురికాకుండా, ఇతర ప్రమాదాల బారిన పడకుండా ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. పిల్లలకు రామాయణ, మహాభారతం, ఇతిహాస కథలు, మెదడుకు పదును పెట్టే ఆటలతో ఈ వేసవి సెలవుల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలి.

పల్లెటూర్లు మేలు..

దేశ ప్రగతికి మూలాలు గ్రామీణ ప్రాంతాలు. వేసవి సెలవుల్లో పిల్లలను అమ్మమ్మ, నాయనమ్మ ఇంటికి పంపించేందుకు ప్రయత్నించండి. నగర కాలుష్యానికి దూరంగా పిల్లలు పల్లెటూరి వాతావరణాన్ని ఆస్వాదిస్తే అనేక విషయాలు తెలుస్తాయి. ముఖ్యంగా వ్యవసాయ పద్ధతులు ఆచార వ్యవహారాలు మన సంస్కృతి తెలిసే అవకాశం ఉంటుంది.

పిల్లలపై కోపం వద్దు..

వేసవి సెలవుల్లో పిల్లలు అల్లరి చేసే అవకాశం ఉంటుంది. దీంతో అదే పనిగా కోపం తెచ్చుకోవద్దు. వారికి అర్థమయ్యేలా చెప్పి చూడండి. వారిని ఏదైనా పనిలోబిజీగా ఉండేలా చూడండి. రోజులో కొద్ది సమయం పిల్లలకు కేటాయించి వారితో ముచ్చటించండి. వారికి నచ్చిన ఆహారం తయారు చేసి తినిపించండి. పిల్లలతో గార్డెనింగ్ చేయించడం ద్వారా అల్లరిని కట్టిపెట్టవచ్చు.

విలువలు నేర్పించాలి..



పెద్దలను గౌరవించే నైతిక విలువలను పిల్లలకు నేర్పించేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యంగా ఆడ పిల్లలు, వృద్ధులపై గౌరవం పెరిగేలా వారిలో మంచి భావాన్ని కల్పించాలి. రామాయణం, మహాభారతంతో పాటు నీతికథలు బోధించే వారి వద్దకు పిల్లల్ని పంపించాలి. సాహిత్యంపై అవగాహన కల్పించాలి.

– బి.అన్నపూర్ణమ్మ, సత్యసాయి బాల వికాస్ నిర్వాహకురాలు, టెక్కలి

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- పిల్లలను బావులు, చెరువుల్లో ఈత కొట్టేందుకు పంపించకండి. అవసరమైతే మీరే స్వయంగా వారికి తోడుగా వెళ్లండి.
- ద్విచక్రవాహనాలు నడపమని వారి చేతికి తాళాలు ఇవ్వవద్దు. వారికి తాళాలు కనిపించకుండా ఉండేలా జాగ్రత్త తీసుకోండి. మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు వారి చేతికి ఇవ్వకపోవడం ఉత్తమం.
- స్నేహితులతో కలిసి దూరప్రాంతాలకు పంపకండి.
- మధ్యాహ్న సమయంలో ఆరుబయట ఆడుకోవడానికి అనుమతించకండి. ఉదయం , సాయంత్రం వేళల్లో మాత్రమే ఆడుకోవడానికి పంపించడం మేలు.
- ఇంట్లో పెద్దలతో వారు ఎక్కువ సమయం గడిపేలా చూడండి. వీలైనంత వరకు మన సంప్రదాయాలను నేర్పించాలి.
- రామాయణం, మహాభారతం, ఇతిహాస కథలు చెప్పే వారి వద్దకు పిల్లల్ని పంపించండి.
- పిల్లలు ఆడుకోవడానికి సమయం నిర్ణయించండి. వేసవికాలంలో పిల్లలు ఆడుకునేందుకు నిర్దిష్టమైన టైం టేబుల్ ను రూపొందించండి. అప్పుడు పిల్లలు టైం టేబుల్ ప్రకారం ఆడుకునే వీలుంది. అదే పనిగా ఎండల్లో ఆడుకోకుండా నీడ పట్టునే ఉంటారు. ముఖ్యంగా పిల్లలు టీవీ ఎక్కువ సమయం చూడకుండా వారిని ఫిజికల్ గేమ్స్ వైపు మోటివేట్ చేస్తే మంచిది.
- పిల్లలకు ఉదయం యోగా, సాయంత్రం కరాటే, డ్రాయింగ్, నృత్యం, స్విమ్మింగ్, క్రికెట్, చెస్, వంటి వాటిలో శిక్షణ ఇప్పించడం వల్ల వారు బోర్ ఫీల్ అవ్వరు.
- వేసవికాలంలో పిల్లలు అల్లరి చేస్తున్నారని వారికి మీ స్మార్ట్ ఫోన్ ఇచ్చి ఆరోగ్యాన్ని పాడు చేయకండి.
- మొబైల్ ఫోన్ బదులు మంచి కథల పుస్తకాలు, డ్రాయింగ్ పుస్తకాలు కొనివ్వండి. వారిలో సృజనాత్మకతను వెలికి తీసేలాబొమ్మలు వేయించండి. లేదా ఇతర కళలను నేర్పించండి.

• విన్యాసకారులు


ఇచ్ఛాపురం మండలం కమళాయిపుట్టుగ– లండపుట్టుగలో జరుగుతున్న అసిరిపోలమ్మ గ్రామదేవత ఉత్సవాల్లో ఒడిశా కళాకారుల గారడీ విన్యాసాలు అదరహో అనిపించాయి. ముఖ్యంగా నిప్పుతో చేసిన విన్యాసాలు గగుర్పాటుకు గురిచేశాయి. – ఇచ్ఛాపురం రూరల్

• శ్రమైక్యజీవులు


జి.సిగడాం మండలంలోని పాగిరి–జి.సిగడాం గ్రామాల మధ్య సాగునీటి బావిలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించేందుకు రైతులు నడుం బిగించారు. నేరుగా రైతులే భుజానికి కర్రతో చేసిన పరికరాలు అమర్చుకుని మండుటెండను సైతం లెక్క చేయకుండా శ్రమదానం చేశారు. – జి.సిగడాం

• ఈదురుగాలులు


హిరమండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల చెట్టు కొమ్మలు నేలకొరిగాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు సాయంత్రం వరకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఉక్కపోతతో విలవిల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. – హిరమండలం

గుడ్డు బిల్లుల్లో ఇదేం తీరు?

- ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించేందుకు కొందరు ఎస్ఎస్ఏ ఉద్యోగుల స్కెచ్
- డైట్ బిల్లులకు భిన్నంగా లేఖలు ఇవ్వాలని కేజీబీవీ ఎస్‌వోలపై ఒత్తిడి

శ్రీకాకుళం: జిల్లా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించేందుకు సర్వశిక్షా అభియాన్‌లో కొందరు ఉద్యోగులు స్కెచ్ వేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిత్యావసర సరకులు, మాంసం, గుడ్లు సరఫరా చేసేందుకు ముందుగా టెండర్లు నిర్వహిస్తారు. టెండర్ రోజున ఖరారు చేసిన ధరలకే సంవత్సరం పొడవునా సరఫరా చేయాల్సి ఉంటుంది. రేటు పెరిగినా, తగ్గినా ఇందులో మార్పు ఉండదు. దీనిలో భాగంగా గుడ్డు ధర పేపరు ధరకు సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఇందుకు భిన్నంగా కొన్ని నెలల నుంచి గుడ్డు ధర రూ.6.30 పైసలకు బిల్లు దాఖలు చేస్తున్నారు. బిల్లులు దాఖలు చేసే నాటికి గుడ్డు ధర రూ. 5.50పైసలు ఉండగా అదనంగా 80పైసలు చెల్లిస్తూ వస్తున్నారు. కేజీబీవీల నుంచి రూ.6.30పైసలకు బిల్లులు వస్తుండగా ఆ మేరకు చెల్లింపులు కూడా జరిగిపోయాయి. ఎస్ఎస్ఏలోని అధికారుల సూచనల మేరకే బిల్లులు దాఖలు చేస్తున్నట్లు ఎస్‌వోలు చెబుతున్నారు. కాగా అదనపు చెల్లింపుల విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఆయన వివరణ కోరడంతో రెండు రోజులుగా ఎస్‌వోలపై ఎస్ఎస్ఏలోని కొందరు ఉద్యోగులు ఒత్తిడి తెస్తూ పేపరు ధరకే బిల్లులు దాఖలు చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ఎస్‌వోలు 'సాక్షి'కి తెలిపారు. బిల్లులు దాఖలు చేసినదానికి విరుద్ధంగా లేఖలు ఇస్తే తాము తప్పు చేసినట్లు అవుతుందనిర, తమను హెచ్చరిస్తూ వ్యాఖ్యానాలు చేస్తున్నారని, వాయిస్ మెసేజ్‌లు కూడా పెడుతున్నారని వాపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో లేఖలు ఇవ్వకూడదని బుధవారం జరిగిన ఎస్‌వోల రహస్య సమావేశంలో నిర్ణయించుకున్నట్లు భోగట్టా. ఇదిలా ఉంటే నిత్యావసర సరకుల సరఫరా కాంట్రాక్ట్ కూడా కాంట్రాక్ట్ పొందిన వ్యక్తి కాకుండా వేరొకరు సరఫరా చేస్తున్నట్లు, అవి నాశిరకంగా ఉంటున్నట్లు ఎస్‌వోలు చెబుతున్నారు. అయితే బిల్లులు మాత్రం కాంట్రాక్ట్ పొందిన సంస్థ నుంచే దాఖలు అవుతుండడంతో వారికి బిల్లులు చెల్లిస్తున్నారు.

రికవరీ చేస్తాం..

ఈ విషయాన్ని అకౌంట్ సెక్షన్ సూపరింటెండెంట్ పద్మావతి వద్ద ప్రస్తావించగా గుడ్డు ధర అదనంగా చెల్లించడం వాస్తవమేనన్నారు. వారి నుంచి రికవరీ చేస్తామన్నారు. బిల్లుకు విరుద్ధంగా ఎస్‌వోలను లేఖలు అడగడం నిజమేనని, ఎఫ్ఏవో సూచనల మేరకే ఎస్‌వోలకు వాయిస్ మెసేజ్ పెట్టామన్నారు. నిత్యావసర సరకుల కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారో, ఎవరు సరఫరా చేస్తున్నారో తనకు తెలియదని పేర్కొన్నారు.

'నాన్‌స్టాప్'గా రద్దీ


నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద రద్దీ

శ్రీకాకుళం అర్బన్: జిల్లాకేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ బుధవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్లు వేసేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం స్వస్థలాలకు బయలుదేరేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకోవడంతో రద్దీగా కనిపించింది. నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద బారులు తీరుతూ కనిపించారు. రద్దీకి తగ్గట్లు బస్సులు సిద్ధం చేశారు.

నాలుగోసారి గౌరవ డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న మంత్రి వెంకటస్వామి

శ్రీకాకుళం: సామాజిక సేవకుడు డాక్టర్ మంత్రి వెంకటస్వామికి నాలుగో సారి గౌరవ డాక్టరేట్ లభించింది. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో డే స్ప్రింగ్ ఇంటర్‌నేషనల్ యూనివర్సిటీ, భారత్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన సభలో వెంకటస్వామికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నాహాలు

- ఈ నెల 24 నుంచి నిర్వహణ
- హాజరుకానున్న 1909 మంది విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ నెల 24 నుంచి జరగనున్న పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, ఇతర అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 28745 మంది పది పరీక్షలకు హాజరుకాగా 93.36 శాతం ఉత్తీర్ణతతో 26836 మంది ఉత్తీర్ణులయ్యారు.


1909 మంది ఫెయిలయ్యారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు పరీక్ష ముందు రోజు వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఫీజులు చెల్లించే విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాల్లో పరీక్షలు రాసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్లు, తనిఖీ బృందాల నియామకంలో అధికారులు నిమగ్నమయ్యారు.

దేవస్థానం భూముల శిస్తుల దుర్వినియోగంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని గుడివీధి సమీపంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి దేవాలయానికి అనుసంధానంగా ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం తాలుకా భూముల శిస్తుల సొమ్ము దుర్వినియోగమైనట్లు ఆలయ ఈవో ఎం.సుకన్య గురువారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పై రెండు దేవాలయాల్లో ఏకీకృత సర్వీసు కింద అటెండరుగా పనిచేస్తున్న వి.సతీష్ దేవస్థానాలకు చెందిన భూముల శిస్తు సొమ్ము అనధికారికంగా వసూళ్లు చేసి దుర్వినియోగానికి పాల్పడ్డాడు. ఆంజనేయ దేవాలయానికి సంబంధించి రూ.2,16,800, కోటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి రూ.3,162 సొమ్ము వసూళ్లకు పాల్పడటమే కాక వాటికి సంబంధించిన రశీదులను రిజిస్టర్ బుక్ నుంచి మాయం చేశాడు. ఇటీవలే విధుల్లోకి చేరిన ఈవో సుకన్య ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లగా వారు ఫిర్యాదు చేయమని చెప్పడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ పేర్కొన్నారు.

జూలైలో ఖరీఫ్‌కు తోటపల్లి నీరు విడుదల

- గత ఐదు సీజన్లలో తోటపల్లి పాత ఆయకట్టుకు నీటి పంపిణీ
- శివారు ఆయకట్టులో పెరిగిన పంటల దిగుబడి


తోటపల్లి జలాశయం

వీరఘట్టం: పాత ఆయకట్టుకు ప్రతి ఏటా ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో నీరందిస్తూ పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను తోటపల్లి జలాశయం సస్యశ్యామలం చేస్తోంది. ఈ మేరకు గడిచిన ఐదు ఖరీఫ్ సీజన్లలో ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎటువంటి ఇబ్బందులు పడకుండా జలవనరులశాఖ అధికారులు ప్రణాళికా బద్ధంగా నీటిని పంపిణీ చేశారు. అంతేకాకుండా ఓ పక్క కాలువల ఆధునికీకరణ పనులు చేపడుతూనే మరో పక్క సాగునీరు పంపిణీ చేస్తూ సాగును సస్యశ్యామలం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గడిచిన ఐదేళ్లుగా పంటల దిగుబడి పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా సకాలంలో నీటిని పంపిణీ చేసేందుకు జలవనరులశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. జూలై మొదటివారంలో తోటపల్లి పాత ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు.

ఇంతవరకు జరిగిన ఆధునికీకరణ పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులపై దృష్టి సారించింది.37.536 కి.మీలు పొడవున్న ఎడమ కాలువలో ఇంతవరకు 16.843 కి.మీ వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. అలాగే 17.616 కి.మీ పొడవున్న కుడి కాలువలో 9.376 కి.మీ వరకు కాంక్రీట్ పనులు చేపట్టారు. మొత్తం 55.152 కి.మీకు గాను ఇంతవరకు 26.919 కి.మీ అనగా 48 శాతం పనులు చేపట్టారు. అంతేకాకుండా ఎడమకాలువలో అచ్చపువలస వద్ద, 6వ బ్రాంచ్ వద్ద, ఎం.రాజపురం వద్ద, కత్తులకవిటి వద్ద వెడల్పయిన వంతెనలు నిర్మించి వాహనరాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఇలా నీటి పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా గత ఖరీఫ్‌లో చర్యలు చేపట్టి శివారు వరకు సాగునీరందించారు. ఇలా ఒక పక్క ఆధునికీకరణ పనులు చేపడుతూ మరో పక్క గత ఐదు ఖరీఫ్ సీజన్లలో సకాలంలో కాలువలకు సాగునీరందిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి ఆయకట్టును సస్యశ్యామలం చేసింది. ఈ ఏడాది కూడా సకాలంలో నీరు విడుదల చేసి శివారు ఆయకట్టుకు తొలి ప్రాధాన్యంగా నీటి పంపిణీ చేయనున్నారు.

జూలైలో నీటి విడుదల



గత ఖరీఫ్ సీజన్‌లో శివారు రైతులు ఇబ్బందులు పడకుండా సాగునీరు పుష్కలంగా అందించాం. దీంతో గతేడాది పంటల దిగుబడి కూడా బాగా వచ్చింది. శివారు ప్రాంతంలో కాలువల్లో, డిస్ట్రిబ్యూటరీ చానల్స్‌లో, బ్రాంచ్ కాలువల్లో ప్రస్తుతం పేరుకు పోయిన పిచ్చి మొక్కలు తొలగించి జూలైలో నీటి విడుదలకు చర్యలు చేపడుతున్నాం.

దమలపాటి రవికుమార్, డీఈఈ
జలవనరులశాఖ, పాలకొండ డివిజన్

ఆశాజనకంగా 'దోస'

- వేసవి నేపథ్యంలో దోసకాయలకు గిరాకీ
- ఇతర ప్రాంతాలకూ ఎగుమతులు


మునగవలస వద్ద సాగు చేస్తున్న దోసపంట

ఆమదాలవలస రూరల్: వేసవి తాపం పెరగడందో దోసకాయలకు గిరాకీ పెరిగింది. చల్లని నేస్తాలుగా పేరుపొందిన దోసకాయలు మన జిల్లాతో పాటు ఒడిశాకు చెందిన వారు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడి రైతులు ప్రతి రోజూ ఇతర జిల్లాకు వీటిని ఎగుమతి చేస్తూ తమ వ్యాపారాలను ముందుకు సాగిస్తున్నారు. ఆమదాలవలస మండలంలో మునగవలస, జొన్నవలస, సరుబుజ్జిలి మండలంలో రొట్టవలస, అవతరాబాద్ గ్రామాల్లో దోసకాయలు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మార్కెట్‌కు తరలించడంతో పాటు రోడ్డు పక్కన రైతులే స్వయంగా విక్రయాలు సాగు చేస్తున్నారు. వివాహాది శుభకార్యాలు చేసుకునే వారు దోసకాయలను విందు భోజనాల్లో సైతం అందుబాటులో ఉంచుతున్నారు. అందుకే వీటికి గిరాకీ పెరిగింది. సైజు బట్టి రూ.5 నుంచి రూ.30 వరకు, కిలో రూ.50 చొప్పున రైతులు విక్రయిస్తున్నారు. మునగవలస, రొట్టవలస గ్రామాల వద్ద దోసకాయలను ఇతర జిల్లాలకు చెందిన ప్రయాణికులతో పాటు ఒడిశా వాసులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

SINGLE SITTING

■ SINGLE SITTING : 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., M.B.A, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs /Back Logs) from recognised Universities. Exams in May/June Cont: ✆ : 73383 76874 [R-451]

Services

BUSINESS OFFER

■ WE are READY TO INVEST TO DEVELOP YOUR BUSINESS. we also Welcome Agents. Good Salary & Commission. Cont: 9092692403 [IA-017]

Wanted

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/– మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185079]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899 [HA-799881]

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ ఆఫీస్ అసిస్టెంట్స్, నర్సులు, లేడీ కేర్ టేకర్స్, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-14041]

■ కష్టపడేస్వీకాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పు,ఆయా,నర్సులు, వంట చేయువారు,RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీరూం+ భోజనం. HYD. 9014885406 [HA-131]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.